కోకాపేటలో ఘనంగా పోచమ్మ బోనాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట గ్రామంలో సోమవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎల్లమ్మకు బోనాలు నిర్వహించగా సోమవారం పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే దేవాలయానికి చేరుకున్న భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం బోనాలతో మహిళలు వెంట రాగా పోతురాజుల విన్యాసాలతో దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు, తొట్టెలను సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ నాయకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అవసరం



క్రీడాకారులకు జెర్సీలను అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి

శంషాబాద్: క్రీడాకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు కొలను ప్రదీప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తొండుపల్లి ఎంపీఎస్ క్రీడామైదానంలో జరుగుతున్న శంషాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఎఫ్‌సీసీ జట్టుకు ఆయన జెర్సీలతో పాటు క్రీడా పరికరాలను సొంత నిధులతో కొనుగోలు చేసి పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో ఎక్కువగా పాల్గొనాలని సూచించారు. ఎఫ్‌సీసీ జట్టు కెప్టెన్ ఎం.శివారెడ్డి, క్రీడాకారులు వెంకట్‌రెడ్డి, ప్రశాంత్, స్వామినాయక్, జాఫర్, అల్తాఫ్ పాల్గొన్నారు.

మెదడు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గచ్చిబౌలి: మెదడు ఆరోగ్యంను నిర్లక్ష్యం చేస్తే జీవితానికే ముప్పు అని కేర్ ఆస్పత్రుల సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ కైలాస్ మిర్చే హెచ్చరించారు.వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా మారుతున్న జీవనశైలిలో మెదడు ఆరోగ్యాన్ని మరవద్దని, లక్షణాలే హెచ్చరికలని వెంటనే స్పందించాలని ఆయన సూచించారు. శరీరాన్ని నియంత్రించే అత్యంత ముఖ్యమైన అవయవం మెదడు అని పేర్కొన్నారు. మెదడు ఆరోగ్యాన్ని నిలబెట్టే జీవనశైలిపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోందన్నా రు. స్ట్రోక్, ఎపిలెప్సీ, డిమెన్షియా, మల్టిపుల్ స్క్లిరోసిస్, మెదడు క్యాన్సర్ వంటి వ్యాధులు ఇప్పుడు యువతను, వృద్ధులను ఒకేలా ప్రభావితం చేస్తున్నాయన్నారు. దీని వెనుక ప్రధానంగా పెరిగిన ఒత్తిడి, జీవనశైలి అవగాహన లోపమే కారణమన్నారు. స్ట్రెస్, మానసిక అలసట, డిజిటల్ ఓవర్‌లోడ్ వేధిస్తున్నాయన్నారు. ధ్యానం లేదా మైండ్‌ఫుల్‌నెస్ వంటి విధానాల ద్వారా ఒత్తిడిని నియంత్రించడం, స్క్రీన్ టైమ్‌కు గడువు విధించడం, డిజిటల్ విరామం తీసుకోవడం మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మెదడుకు మంచి ఆహారం వాల్‌నట్స్, ఫ్యాటీ ఫిష్, బెర్రీస్, ఆకుకూరలు వంటి ఆహార పదార్థాలు అవసరమని చెప్పారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం కేసులో బీఆర్‌ఎస్ నేతలకు నోటీసులు

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన ఘటనలో బీఆర్‌ఎస్ నేతలకు బంజారాహిల్స్ పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వివరాలివీ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా ఆర్డినెన్స్ జారీ చేయకుండా డైరెక్ట్‌గా ఎలా ఇస్తారంటూ బీఆర్‌ఎస్ సీనియర్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నేతలు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని అగ్రసేన్ చౌరస్తాలో ఈ నెల 11వ తేదీన సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ ఘటనలో గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు ధూళిమెట్ల బాలరాజ్, కోటి కిషోర్, ఉపేంద్రచారి, విజయ్‌కుమార్, ఆంజనేయగౌడ్, నాగరాజు తదితరులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో బాలరాజ్, కిషోర్, ఉపేంద్ర, విజయ్‌కుమార్‌లకు నోటీసులు జారీ చేశారు.

మరో ఘటనలో...

ఓ టీవీ చానల్‌పై దాడి చేసిన కేసులో బీఆర్‌ఎస్ భవన్‌లో ఉన్న గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులను అడ్డుకునేందుకు యత్నించిన బీఆర్‌ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, పావనీరెడ్డి, సునీత, బాల్క సుమన్‌లపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 28వ తేదీన అర్ధరాత్రి తెలంగాణ భవన్ వద్ద ఈ ఘటన జరిగింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం మన్నె గోవర్ధన్‌రెడ్డి, పావనీరెడ్డి, సునీతలకు నోటీసులు జారీ చేశారు.



ఆరాంఘర్ చౌరస్తా వద్ద స్తంభించిన ట్రాఫిక్



ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి వద్ద బారులు తీరిన వాహనాలు

దంచికొట్టిన వాన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో సోమవారం మధ్యాహ్నం వర్షం దంచి కొట్టింది. కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన, జాతీయ రహదారులపై వర్షపు నీరు నిలిచిపోంది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 2 గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కిన పలువురు ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు. వరదనీరు అండర్ రైల్వే బ్రిడ్జితో పాటు ప్రధాన రహదారిపై నిలిచిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఒక్కసారిగా కురిసిన వర్షం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



హైదర్‌గూడలో...

రాజేంద్రనగర్‌లో భారీ వర్షం

- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- సుమారు 3 కిలోమీటర్ల మేర ఆగిన వాహనాలు
- స్తంభించిన పౌరజీవనం

- ఆరాంఘర్, శివరాంపల్లి, నేషనల్ పోలీసు అకాడమీ, మైలార్‌దేవ్‌పల్లి, సాయిబాబానగర్ కాలనీ, నేతాజీనగర్, బుద్వేల్ అండర్‌పాస్, కాటేదాన్ మెయిన్ రోడ్డు, ఓల్డ్ కర్నూల్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు రోడ్డు, గగన్‌పహాడ్, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి ప్రధాన రహదారులపై వరదనీరు రోడ్లపై పెద్ద ఎత్తున నిలిచిపోయింది.
- ఆరాంఘర్ అండర్ పాస్‌లో వరదనీరు నిలిచిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దాదాపు 3 కిలో మీటర్ల మేర రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



నేతాజీనగర్‌లో మోకాళ్ల లోతు నిలిచిన వర్షపు నీరు

- నేతాజీనగర్‌లో వరదనీరు చొచ్చుకు రావడంతో కొన్ని ఇళ్లల్లోకి వరదనీరు చేరింది. రహదారిపై మొకాళ్ల లోతు నీరు నిలిచిపోవడం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతంలో ఈ ప్రాంతాలో వరదనీటి సమస్య అధికంగా ఉందని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.
- రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ సిబ్బంది సర్కిల్ పరిధిలో నిలిచిపోయిన వరద నీటిని తొలగించేందుకు నానా తిప్పలు పడ్డారు. భారీ వర్షం కురవడంతో వరదనీరు ఒక్కసారిగా రోడ్లపై నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. రెండు గంటల అనంతరం వరదనీరు తగ్గుముఖం పడటంతో చెత్తాచెదారంతో పాటు ఇసుక మేటలను తొలగించి వరదనీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

ముంపు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నేతల పర్యటన

మైలార్‌దేవ్‌పల్లి: చిన్నపాటి వర్షాలకే రోడ్లపై నీరు చేరి ప్రజలు నరకయాతనకు గురవుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లు జలమయమై ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదలు నివసించే బాబుల్‌రెడ్డినగర్‌లో వరద సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారన్నారు. వర్షాకాలం వచ్చిందంటే బాబుల్‌రెడ్డినగర్‌లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జలమండలి అధికారులు, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు సమీక్షించి బాబుల్‌రెడ్డినగర్‌లో నివసిస్తున్న ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు హనుమంతు, ఉప్పల్ శ్రీనివాస్, తిమ్మప్ప, రాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.



బాబుల్‌రెడ్డినగర్‌లో వరదను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ మైలార్‌దేవ్‌పల్లి అధ్యక్షుడు వెంకటేష్

నియామకం



సంకూరి జయప్రకాష్

మైలార్‌దేవ్‌పల్లి: ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సొసైటీ నూతన అధ్యక్షుడు సంకూరి జయప్రకాష్ వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీలోని ఇందిరాంగాంధీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ పాలకవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంకూరి జయప్రకాష్‌ను నియమిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా సహకార అధికారి కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.నాగేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యక్షులుగా కె.ఎల్లప్ప, కార్యదర్శిగా మల్లెల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా బి.ఫణికుమార్, పాలకవర్గం సభ్యులుగా పి.లలిత, జి.సురేఖ, వి.రమేష్, బి.శ్రీనివాస్‌గౌడ్, ఎం.ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. అనంతరం అధ్యక్షుడు సంకూరి జయప్రకాష్ మాట్లాడుతూ... సొసైటీ సంక్షేమానికి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా ముందుకు సాగడం జరుగుతుందన్నారు. స్థలాలను కాపాడుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

'విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం'

చార్మినార్: బోనాల ఉత్సవాలకు ఎక్కడ ఎలాంటి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ మెట్రో జోన్ సీజీఎం సాయిబాబా తెలిపారు. సోమవారం చార్మినార్ ప్రధాన వీధుల్లో నిర్వహించిన అమ్మవారి ఘటాల పరిసమాప్తి సామూహిక ఊరేగింపు సందర్భంగా ఆయన పాత బస్తీలో విద్యుత్ సరఫరాను పరిశీలించారు. టీజీఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ సోమిరెడ్డి, చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్, చార్మినార్ ఏడీఈ మక్బూల్‌లతో కలిసి విద్యుత్ సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

రహదారి విస్తరణ ఆవశ్యకతపై అవగాహన

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ ఎస్ఎంపీ పాఠశాలలో జాతీయ రహదారి విస్తరణ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ ఎన్‌హెచ్–163 రహదారి విస్తరణకు 45 రోజులుగా చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్, కొడంగల్ నియోజకవర్గాలలో అవగాహన సదస్సులు నిర్వహించి సమస్య తీవ్రతను ప్రజల దృష్టికి తీసుకువెళ్లామని సమితి సభ్యులు వెల్లడించారు. తక్షణమే జాతీయ రహదారిని విస్తరించి ఈ ప్రాంత అభివృద్ధికి ఉద్యోగ, ఉపాధికి, వ్యవసాయ ఉత్పత్తులో నగరానికి తీసుకురావడానికి, ఆరోగ్య సమస్యలతో మెరుగైన వైద్యం గురించి హైదరాబాద్ వచ్చే వారికి మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేయడానికి, పశ్చిమ రంగారెడ్డి జిల్లా అభివృద్ధి లోచన పోవడం చాలా విచారకర విషయమని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నట్లు కార్యక్రమం ద్వారా వివరించారు. సాధన సమితి సభ్యులకు తమ సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. రోడ్డు విస్తరణ చేపట్టే వరకు దశల వారీగా స్థానిక శాసన సభ్యులకు పార్లమెంట్ సభ్యునికి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. రోడ్డు దుస్థితి వారి దృష్టికి తీసుకొచ్చి ఒక టైంబాండ్ కార్యక్రమం ద్వారా వాళ్లకు నివేదిస్తూ న్యాయ సలహాలు కావాలిస్న న్యాయ సలహాలు తీసుకుంటూ రాజకీయంగా రాజకీయ నాయకులను ఈ పనులు జరిగేందుకు కృషి చేసేలా కలిసి తమ డిమాండ్‌ను తెలియజేయాలని నిర్ణయించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ కె.గోపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రప్రకాష్‌రెడ్డి, డాక్టర్ జగన్‌మోహన్, వెంకట్, రఘు, రాములు, భీమ్‌రెడ్డి, వంశీ, నర్సింహులు, జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జయకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పారిశ్రామికవేత్త శ్రీనివాస్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ధ్యేయం

గోల్కొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్లలో ఇంటింటికీ మజ్లిస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని మహిళలు తమ తమ ఫిర్యాదులను ఆయనకు విన్నవించారు. నల్లాలలో తాగునీరు సరిగా రావడం లేదని కొందరు ఫిర్యాదు చేయగా..మరికొందరు రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుందని ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత వారం కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగాయని దీన్ని వల్ల రోడ్లపై మురుగు నీరు ప్రవహించిందన్నారు. అయితే వెంట వెంటనే బల్దియా మాన్సూన్ టీమ్‌లు సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాయన్నారు.

ముష్కి చెరువు పరిరక్షణకు ఉద్యమిస్తాం


మణికొండ: నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల మధ్యలో ఉన్న ముష్కి చెరువును పరిరక్షణకు అవసరం అయితే ఉద్యమిస్తామని మైహోం అవతార్, హాల్‌మార్క్ వినిసియా నివాసితులు పేర్కొన్నారు. సోమవారం చెరువు వద్ద వారు సమావేశమయ్యారు. చెరువు వద్ద నిబంధనలకు విరుద్ధంగా దృవాన్ష్ సంస్థ చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ అభ్యంతరాలను ఇప్పటికే హైడ్రా, హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ చర్యలను ఆయా శాఖల అధికారులు సైతం అభినందించి దిద్దుబాటు చర్యలు చేపడతామని, హెచ్‌ఎండీఏతో తత్వా రియల్ ఎస్టేట్ సంస్థకు జరిగిన ఒప్పందాల ప్రకారమే పనులను చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. వాటిని నిలుపుకొనేందుకు మరో వారం రోజుల పాటు సమయం ఇస్తామని, అయినా నిబంధనలకు విరుద్ధంగా పనులను చేపడితే ప్రజా ఆందోళనను చేపడతామన్నారు. కార్యక్రమంలో నివాసితుల సంఘం ప్రతినిధి గౌతంరెడ్డి, నివాసితులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న నివాసితులు

భక్తిశ్రద్ధలతో కావడి యాత్ర

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని 'కావడ్ సేవా సంఘం' ఆధ్వర్యంలో శివ కావడి యాత్రను ఘనంగా నిర్వహించారు. హరహర మహాదేవ' అంటూ కావడి మోశారు. నానక్‌రాంగూడలోని జై వీర హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజ అనంతరం కావడియాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సంఘం ముఖ్య ప్రతినిధులను సత్కరించారు.ఆలయం నుంచి ఔటర్ రింగురోడ్డు అండర్‌బ్రిడ్జి నుంచి సర్వీస్‌రోడ్డు మీదుగా మంచిరేవులలోని శివాలయం వరకు యాత్ర కొనసాగింది. అనంతరం శివుడికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కావడి యాత్రలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొనగా సంఘం ఆధ్వర్యంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు.



వేడుకగా తొట్టెల ఊరేగింపు

రాజేంద్రనగర్: పోతరాజుల నృత్యాలు... యువతల కేరింతల నడుమ సోమవారం సాయంత్రం శివరాంపల్లిలో తొట్టెల ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు కార్తీక్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల నృత్యాలు , యువతీయువకులు బ్యాండ్ మేళాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు.

హైదర్‌గూడలో..

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో తొట్టెల ఊరేగింపును సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా పోచమ్మ దేవాలయానికి తొట్టెలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. నేతలు కొలన్ సుభాష్‌రెడ్డి, చట్టిగారి నరేందర్, రామేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువులో అమ్మవారి తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఆమెన్, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న కార్తీక్‌రెడ్డి



హైదర్‌గూడలో తొట్టెల ఊరేగింపులో గ్రామస్తులు



వినాయక్‌నగర్‌లో కుంగిన రోడ్డు



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ వినాయక్‌నగర్ కాలనీలో రోడ్డు మధ్యలో కుంగిపోయింది. దీంతో పాదచారులు, వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వివరాలివీ... వినాయక్‌నగర్ కాలనీలో డ్రైనేజీని నిర్మించారు. అనంతరం రోడ్డు వేశారు. అయితే వేసేటప్పుడు కాంట్రాక్టర్ సరిగా మట్టి పోసి పూడ్చలేకపోవడంతో ఇక్కడ రోడ్డు క్రమంగా కుంగిపోతోంది. సంబంధిత అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి రోడ్డు పనులను సరిగా పర్యవేక్షించనందునే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులను చేశారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

దుర్గానగర్‌లో కరాటే స్టేట్ సెలెక్షన్స్

జియాగూడ: రాయిపూర్‌లో ఆగస్టు 17 నుంచి 20 వరకు జరిగే 33వ ఏఐకెఎఫ్ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్–2025 పోటీలకు తెలంగాణ నుంచి 18 మంది పలు స్కూళ్లకు చెందిన కరాటే విద్యార్థులు గోల్డ్‌మెడల్స్ సాధించిన వారు పోటీల్లో పాల్గొంటున్నట్లు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఏఐకెఎఫ్ సహ కోశాధికారి ముల్తాంకార్ శ్రీబాలాజీ అన్నారు. సోమవారం దుర్గానగర్‌లోని భారత అభ్యుదయ శిక్షాసమితి ఏకె భవన్‌లో 11వ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కరాటే డో చాంపియన్‌షిప్, స్టేట్ సెలెక్షన్స్ జరిగాయి. ఆల్ ఇండియా కరాటే డో ఫెడరేషన్ ఆదేశాల మేరకు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ నిర్వహించిన పోటీల్లో గ్రేటర్‌తో పాటు మెదక్, మేడ్చల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 100 మందికి పైగా పాల్గొన్నారు. ఇందులో 18 మంది కరాటే క్రీడాకారులు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్‌లు సాధించారు. ముల్తాంకార్ శ్రీబాలాజీ మాట్లాడుతూ..ఈ పోటీల్లో జియాగూడకు చెందిన స్కూల్‌లతో పాటు రాష్ట్రంలోని వివిధ స్కూల్స్ కరాటే విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు.

నిర్లక్ష్యం ఎంత 'గట్టిదో..!

శంషాబాద్ పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ నుంచి జాతీయ రహదారికి వైపు వచ్చే దారిలో బస్సుల రాకపోకలు లేకున్నా ఓ బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తయిన తరువారి దాని కోసం వినియోగించిన సిమెంట్, రాతిపొడర్ సంబంధిత ముడిసరుకును అక్కడే వదిలేశారు. వాటిని శుభ్రం చేయకపోవడంతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈలోగా సిమెంటుతో కలిసి రాతిపొడర్ సెట్ అయి గట్టిగా తయారైంది. ఈ విషయంపై ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల దానిని తొలగించేందుకు జేసీబీతో ప్రయత్నించినా సాధ్యం కాలేదు. అధికారుల నిర్లక్ష్యం ఎంత గట్టిగా ఉందనేదనేందుకు ఇదే నిదర్శనమంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. – శంషాబాద్



కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్: కుటుంబ కలహాలతో వంట మనిషి ఆత్మహత్య చేసుకున్న ఘటన ముచ్చింతల్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి సమాచారం మేరకు... బీహార్ రాష్ట్రానికి చెందిన పుష్పకుమార్(31), తన సోదరుడు సాజన్‌కుమార్‌తో కలిసి ఐదేళ్ల కిందట జీవనోపాధికోసం వలస వచ్చారు. పుష్పకుమార్ ముచ్చింతల్ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రం ఫుడ్ కోర్టులో రెండేళ్ల వంట మనిషిగా పని చేస్తున్నాడు. మదన్‌పల్లిపాతతండాలో గదిని అద్దెకు తీసుకుని మరో వ్యక్తితో కలిసి నివాసముంటున్నాడు. పుష్పకుమార్ తన భార్య రమాపతితో ఫోన్‌లో మాట్లాడుతుండేవాడు. ఈ క్రమంలో వీరద్దరికి కుటుంబ విషయాలపై ఫోన్‌లో గొడవ జరుగుతుండేది. ఈ నెల 19న పుష్పకుమార్ తన భార్యతో ఫోన్‌లో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన అతను అదే రోజు సాయంత్రం అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన తోటి అద్దెదారుడు సోదరుడుతో కలిసి అతన్ని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.